# యాత్రా స్పెషల్

కె.వి.ఎస్.వర్మ

"చరిత్ర ఎరుగని మహాపాతకము మాదేశానికి పట్టినదా, ఆంధ్రదేవా వెంకటేశ్వరా, విరూపాక్ష స్వామీ" అంటూ కొటేషన్‌రావు పాడుతుంటే మిత్రులంతా కళ్లు మూసుకుని విన్నారు.

గోదావరి కూడా తెల్లబోతూ ఆపాట వినడానికా అన్నట్టు నెమ్మదిగా ప్రవహిస్తోంది.

"ఏదేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం" అంటూ కవికుమారుడు అందుకున్నాడు.

"కవికుమారా, ఈ కవిత తమరు వినిపించడంలో ఏమన్నా ధ్వని వుందా" అడిగాడు శాస్త్రి.

"ఏదో దుఃఖం ఈ కవిత వినిపింపజేసింది" అన్నాడు కవికుమారుడు గుంభనంగా.

కథ(రాజు ఏదో అనబోతుంటే, అతణ్ణి మాట్లాడనీయకుండా, కళ్లు మూసుకుని,

"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పదండి తోసుకు
పోదాం, పోదాం పైపైకి"
అంటూ కవికుమారుడు గొంతెత్తాడు.

ఆ కవిత లయ్యాక కళ్లు తెరిచాడు కవికుమారుడు.

"కవికుమారా, మీ మరో ప్రపంచం ఏవిటోకానీ, మేం నిన్ననే మరోప్రపంచం వెళ్లి, పైపైకిపోయి ఇవేళే కిందకొచ్చాం" అన్నాడు సురేష్ నెమ్మదిగా.

అందరూ అతని వంక ఆశ్చర్యంగా చూశారు.

" ఈమధ్య ఓ ఆఫీసులో మాఫ్రెండ్‌కి కావలసిన పని త్వరగా పూర్తయింది. ఇద్దరు ఉద్యోగులు ఆపని చేసిపెట్టారు. లంచం వద్దన్నారు. మందుపార్టీ కావాలన్నారు. మందువ్యవహారాల్లో అనుభవజ్ఞుడిని కదా అని నాఫ్రెండ్ నాదగ్గరకొచ్చి విషయం చెప్పాడు. ఏఆఫీసని ఆరాలడగకండి. మనమిత్రబృందమెవరూ చట్టవిరుద్ధమైన పనులు చెయ్యం కదా. సరే, యానాం తీసుకుపోదాం అన్నాను.

రెండు స్కూటర్ల మీద బయల్దేరాం. ఉదయం పదకొండు గంటలకే ఎండ దంచేస్తోంది. అయినా ఆ ఎండలోనే వెళ్లాం. మరీ పొద్దుబోయాక వెళ్తే అక్కడ మామూలు దొరకవని తెలుసుకునే ముందుగా బయల్దేరాం. రోడ్లు చాలా దారుణంగా వున్నాయి. కబుర్లు చెప్పుకుంటూ నెమ్మదిగా వెళ్లాం. అలా అనేకంటే, స్పీడుగా వెళ్లడం కుదరదు కనక నెమ్మదిగా వెళ్లాం అని చెప్పడం రైటు. మధ్యలో రామచంద్రపురంలో ఓ అరగంట బ్రేకు వేశాం. యానాం వెళ్లేటప్పటికి రెండున్నర అయింది. ఓలాడ్జిలో రెండు రూములు తీసుకున్నాం.

"దాహం దాహం" అని ఒకేసారి కోరస్‌లో పాడుకుని కింగ్‌ఫిషర్ నాలుగు బీర్లు తెప్పించాం.

మా దాహం ఒక్క ఎండవల్ల కలిగిన దాహం కాదేమో, పదినిమిషాల్లోనే బీరు కడుపులోకి నీరులా జారిపోయింది. మరో నాలుగు బీర్లు తెప్పించుకున్నాం. ఈసారి కబుర్లు చెప్పుకుంటూ ఓ అరగంటకు పూర్తిచేశాం. ఇంక చాలనుకుని, భోంచేసి పడుకున్నాం.

అన్నట్టు ఆ బీర్ ఎంతో తెలుసా? పందొమ్మిది రూపాయలు"అంటూ ఆగాడు సురేష్.

"ఏంటీ, బీరు పందొమ్మిది రూపాయలే" అంటూ మిత్రులంతా చొంగకార్చుకుంటూ హాశ్చర్యపోయారు.

అప్పుడే ఏం చూశారు. వెర్రికుట్టెల్లారా అన్నట్టు వాళ్ల వంకచూసి, సురేష్ మళ్లీ మొదలు పెట్టాడు.

నిద్రలేచేటప్పటికి అయిదయింది. స్నానాలు చేసి ఫ్రెష్‌గా తయారయ్యాం.

"ఇప్పుడేం చేద్దాం" అన్నాడు మాఫ్రెండ్ ఆ ఉద్యోగులిద్దర్నీ.


" మాన్షన్‌హౌస్ స్టార్ట్ చేద్దాం" అన్నాడు ఒకడు.

"ఇందాకే కదా బీర్ తాగేం. కాస్త గేప్ ఇస్తే బావుంటుంది" అన్నాడు ఇంకొకడు.

మేమిద్దరం కూడా రెండో వాడికే ఓటు వేశాం.

"అయితే ఏదన్నా సినిమాకు పోదామా"

"ఇక్కడికొచ్చి సినిమా ఏంటీ? మనూర్లో సినిమాలు లేవా"




"ఇందాకా ఇన్సిడెంట్, అదే సంఘటన అనే సినిమా వాల్‌పోస్టర్ చూశాను. బావుంటుందట. మనూర్లో చూడలేకపోయాను"

"డబ్బింగ్ సినిమాకా? నేనురాను"

అంటూ వాళ్లిద్దరూ కాసేపు వాదించుకున్నారు.

ఆఖరికి ఆసినిమాకే వెళ్లాం. బావుంది. ఇంగ్లీషు సినిమా చూసినట్టుంది. పాటలు లేవు. అంతా యాక్షనే. పావు తక్కువ తొమ్మిదికే సినిమా అయిపోయింది. ఫస్ట్‌క్లాసు టిక్కెట్ మూడున్నరే తెలుసా" అంటూ ఆగేడు సురేష్.

"ఏటీ మూ..." అంటూ కొందరు హాశ్చర్యపోబోతుంటే అదేమీ పట్టించుకోకుండా కొనసాగించాడు సురేష్.

లాడ్జికొచ్చి లుంగీల్లోకి మారాం. మాన్షన్ హౌస్ బ్రాందీఫుల్‌కి ఆర్డరిచ్చాం. తినడానికి మిక్చరూ, పకోడీలూ, చికెన్ సిక్స్‌టీఫైవ్ తెమ్మన్నాం. సోడాలు సరేసరి.

చల్లటి సోడా కలిపి, మాన్షన్ హౌస్ మొదటి సిప్ గొంతు జారుతుంటే, ఓహ్ అమృతమే అనుకో" అంటూ నోరు చప్పరించాడు సురేష్.

మిగతా మిత్రులుకూడా గుటకవేస్తూ ఈర్ష్యగా సురేష్ వంక చూశారు.

"అమృతమనేది ఏమిటి? సారాయే! నాడు యిదేగదా తాగడానికి దేవాసురులు తన్నుకు చచ్చారు" జగదీష్ హుషారుగా కన్యాశుల్కంలోని బైరాగి డైలాగు చెప్పాడు.

"చివ చివా! చివచివా" అన్నాడు వెంటనే కథ(రాజు వీరేశం డైలాగును.

"మేన్షన్ హౌజ్‌ఫుల్ బ్రాందీ ఎంతో తెలుసా? 135" అన్నాడు సురేష్.

అంతా నోళ్లు తెరిచి ఓ క్షణంలోనే మండిపోయారు.

"పేక తీశాడు మా ఫ్రెండ్. ఆడుతూ పాడుతూ తాగుతూ బాటిల్ వంక చూశాం. చాలా తరిగిపోయింది. ఎందుకయినా మంచిదని మరో హాఫ్ తెమ్మన్నాం. తనివితీరా తాగాం. తిన్నాం. రాత్రి పన్నెండయింది.

"హేపీ సార్. వెరీ హేపీ సార్"అంటూ వాళ్లిద్దరూ నాలుగు మెతుకులు కతికారు.

"మీరు హేపీ కావడమే నాకు వెరీ హేపీ" అన్నాడు మా ఫ్రెండ్ వాళ్లిద్దర్నీ వాళ్ల గదికి సాగనంపుతూ.

నేను వరండాలోకెళ్లాను. మా గదులకి కాస్త దూరంగా వరండాలో ఓ మంచం మీద కూర్చుని ఒకడు తాగుతున్నాడు. చేతిలో ఫుల్ బాటిలుంది. మేం లాడ్జిలో దిగి రూమ్‌కెళ్లేటప్పుడూ అతను 'నీట్'గా తాగుతుండడం చూశాను. అతను అంతకు ముందు రోజే వచ్చాడట. వచ్చి నప్పటి నుంచీ అదే పనిలో వున్నాడని రూమ్‌బాయ్ చెప్పాడు.

పెరిగిన గడ్డం కాస్త నెరిసి వుంది. అప్పటికీ అతనీ లోకంలో వున్నట్టులేదు.

రూమ్‌కెళ్లి పడుకున్నాం. ఎండెక్కాక లేచా[illegible]ను స్నానం చేసి వచ్చాను. మా ఫ్రెండు బాత్‌రూమ్ కెళ్లాడు.

మా పక్క రూం నుంచి ఉద్యోగులిద్దరూ హడావుడిగా వచ్చారు.

"త్వరగా తయారవండి పోదాం" అన్నారు.

"ఏంటా కంగారు" అన్నాను.

"మీకింకా తెలీదా? మా రూమ్ ముందు వరండాలో మంచంమీద గెడ్డవతను లేడూ?వాడిక లేడు. చచ్చిపోయాడు. పోలీసులొచ్చారు. రెండ్రోజులుగా రాత్రిపగలూ తెగతాగినందు వల్లే చచ్చిపోయుంటాడని అనుకుంటున్నారు." అన్నాడు వుద్యోగి ముఖం విచారంగా పెట్టి.

'అయ్యో' అనుకుంటూ బయటికొచ్చి చూశాను. మంచం ఖాళీగా వుంది. ఫుల్ బాటిల్‌తో కొద్దిగా నెరిసిన ముఖం కళ్లముందు కదిలింది.

"లాడ్జి ఖాళీ చేసి వచ్చేశాం." అంటూ ముగించాడు సురేష్.

'తాగి, తాగి, తాగి ధరణిపై బడుదాక
తాగెనేని తన్ను తాను తెలియు
తాగలేని వాడే తాగుబోతరయంగ
యిశ్వదాభిరామ యినరవేమ '

అని కన్యాశుల్కంలో దుకాణాదారుడు అన్నమాట నిజంకాదు బాస్" అన్నాడు జగదీష్ సీరియస్‌గా.

అంతలో రోడ్‌కమ్ రైలు బ్రిడ్జిమీదకు గౌతమి ఎక్స్‌ప్రెస్ వచ్చింది.

"నేను నా దేశమును ప్రేమించుచున్నాను. నేను భారతీయుడను. నేను నా సహోదరులను ప్రేమించెదను. కన్నడిగను చూసి కానీ, మహారాష్ట్రీయుణ్ణి చూసికానీ, తమిళుణ్ణి చూసికానీ ఈర్ష్యపడను. పొరుగు వాని ఆనందమే నా యానందము" అన్నాడు కొటేషన్‌రావు సీరియస్‌గా మొహంపెట్టి.

ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడని కొటేషన్‌రావు అలా మాట్లాడడంతో అందరూ నిశ్చేష్టులై పోయారు.

అందరూ ఆలోచనల్లో పడి, రెండు నిమిషాలయ్యాక ఇళ్లకు బయల్దేరారు.

కొటేషన్‌రావు భారంగా ఊపిరి పీల్చి అన్నాడు.

"మంచి గతమున కొంచెమేనోయ్"

(అయిపోయింది)